గృహసారథులే విజయసారథులు

- పల్లె రాజకీయ ముఖచిత్రంలో కన్వీనర్లే కీలకం
- తెలుగు మాట్లాడటమే రాని టీడీపీ వారసుడు
- మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



హాజరైన గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయాల కన్వీనరే రేపటి విజయసారథులని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ కార్యాలయంలో నకరికల్లు మండల గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పల్లె రాజకీయముఖ చిత్రంలో గృహ సారథులు, కన్వీనర్లే కీలకమని, గృహసారథులు, కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాల్లో సత్తెనపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందు వరసలో ఉందన్నారు. అనునిత్యం అధికారం కోసం వెంపర్లాడే చంద్రబాబు తన కుమారుడు, టీడీపీ వారసుడికి తెలుగులో మాట్లాడటమే రావడం లేదని, ప్రశాంతత అనే పదాన్ని ప్రశాంతి అత్త అని మాట్లాడు తున్నారని విమర్శించారు. ఇలాంటి వాళ్ళందరూ తనను విమర్శిస్తున్నారని, ఎంత మంది, ఎన్ని పార్టీల వారు ఏకమై తనను టార్గెట్ చేసినా ఐ డోంట్ కేర్ అన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వెంట 1,600 కిలో మీటర్లు నడిచానని, జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టిన ప్పటి నుంచి ఆయన వెన్నంటే ఉన్నానని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశించిన, సామాజిక ప్రజా చైతన్య కార్యక్రమాల్లోనూ నియోజకవర్గం జిల్లాలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఏ పార్టీకి లేనంత పటిష్టమైన వ్యవస్థ మనకు ఉందని, మీరందరూ కష్టపడి పనిచేస్తే రానున్న ఎన్నికల్లో మనకు అధికారం సునాయాసమే నన్నారు. వైఎస్సార్ సీపీది సుదీర్ఘమైన ప్రయాణం అన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇంత పారదర్శకంగా, ఇంత పెద్ద స్థాయిలో సంక్షేమం ఏ ప్రభుత్వం అమలు చేయలేదని వివరించారు. ఏ పార్టీ కి, ఏ గుర్తుకు ఓటు వేసినా వివక్షత లేకుండా సంక్షేమం పారదర్శకంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన అంశాలను పక్కాగా పాటించాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకురేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు రానున్న రోజుల్లో కీలక భూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. తమ పరిధిలోని 50 ఇళ్లల్లో గృహసారథులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. వలంటీర్లతో కలిసి కట్టుగా సమన్వయంతో పని చేయాలని వారిపై పెత్తనం చేయకూడదని స్పష్టం చేశారు. గృహసారథులు ప్రతి గృహానికి వెళ్లి వారితో మంచి, చెడ్డ సంభాషించి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సంక్షేమ పథకాల వివరాలతో పాటు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు కూడా ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు హయాంలో సెంటు భూమి కూడా ప్రజలకు ఇవ్వలేదని, కానీ నేడు వేలాది ఎకరాలు వేలాది కోట్లు వెచ్చించి సొంత ఇంటి కల నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఈ ప్రభుత్వం నిదర్శనమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, నియామక పదవుల్లోనూ అత్యధిక శాతం మంది మహిళలు ఉండటం అభినందనీయమన్నారు. సమావేశంలో నకరికల్లు మండల పార్టీ కన్వీనర్ భవనం రాఘవ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జె హరీష్, మండల ఇన్‌చార్జ్ మేడా ప్రవీణ్ రెడ్డి, దూదేకుల ఆదం భాష, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నవోదయం పథకంపై అవగాహన



అవగాహనాసదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్

నకరికల్లు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం లబ్ధిదారులకు గొప్ప వరమని డీఆర్‌డీఏ పీడీ బి.బాలూనాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవోదయం పథకంపై సోమవారం అవగాహనాసదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 14న కలెక్టరేట్‌లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంచుకున్న యూనిట్‌ను బట్టి బ్యాంకర్ల ద్వారా రుణం పొందే అవకాశం కల్పిస్తారని అన్నారు. ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లబ్ధిదారులకు 35 శాతం బ్యాక్ ఎండ్ సబ్సిడీ వస్తోందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలు నైపుణ్యాన్ని బట్టి ఉపాధికోసం రుణం లభిస్తోందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తీసుకొచ్చిన పథకాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవోదయం ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏపీఓ ప్రసాద్, పలు బ్యాంకుల మేనేజర్లు, సీసీలు పాల్గొన్నారు.

బీపీ మండల్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి



విగ్రహావిష్కరణ పోస్టర్స్ విడుదల చేస్తున్న బీసీ సంఘ నాయకులు

అచ్చంపేట: వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి, సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలు చేసిన బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణకు వేలాదిగా తరలి రావాలని పెదకూరపాడు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు దాసరి పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 12న గుంటూరులో మండల్ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాతర్ల శ్రీనివాసరావు, జిల్లా నాయకులు తిరువాయిపాటి ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ నల్లమేకల వెంకటేశ్వర్లు, మండల బీసీ నాయకులు తాడిబోయిన కిష్టమ్మ, సంపంగి ఏడుకొండలు, తిరుపతిస్వామి, నీలకంఠేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



రోడ్డుకు అడ్డుగా పోసిన మట్టి, రాళ్ళు

సత్తెనపల్లి: రహదారి ఆక్రమించిన వారి పై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని 31వ వార్డు వావిలాల్ నగర్ కాలనీకి చెందిన గరికపాటి రమణయ్య, తాళ్లూరి శ్యాం ప్రసాద్‌లు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్ కె.నగేష్ కు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 31 వ వార్డు వావిలాల్ నగర్ కాలనీ ఏర్పడి ఇప్పటికి 40 సంవత్సరాలు కావస్తుందన్నారు. కాలనీ ఏర్పాటు జరిగినప్పటి నుంచి రోడ్డుగా కేటాయించబడి కాలనీ మ్యాప్ లో కూడా రోడ్డుగా గుర్తింపు కలిగి కాలనీవాసులు, పరిసర పంట పొలాల రైతులు రాకపోకలు సాగిస్తూన్న 30 అడుగుల వెడల్పు రోడ్డుకు అడ్డుగా మట్టితోలి ఇనుప కంచెను అడ్డంగా వేశారన్నారు. దీని వల్లన పరిసర ప్రాంత వాసులతో పాటు కాలనీ వాసులకు కూడా రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా రోడ్డుకు ఉన్న అడ్డును తొలగించి ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని వినతి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లోని అన్ని గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు అన్ని గ్రామాల్లో ప్రారంభించేందుకు ఆదేశాలు జారీ చేయాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప కోరారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ కి వినతి పత్రం అందించారు. అనంతరం చిన్నప్ప మాట్లాడుతూ ఆధార్ కార్డు ఉండి పనికి వెళ్తున్న ప్రతి ఒక్క కూలీలకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ త్వరలోనే ఫీల్డ్ అసిస్టెంట్లు ద్వారా పూర్తి చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ఎక్కువ మందికి ఏర్పాటు చేసే విధంగా చూస్తామని, అదేవిధంగా గ్రామాల్లో ఉన్న పని లేని ఖాళీగా ఉంటున్న సన్న, చిన్న కారు వ్యవసాయ కూలీలు పనులకు వచ్చే విధంగా మీరు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జేసీ శ్యాంప్రసాద్ సూచించారన్నారు. కార్యక్రమంలో గుండాల మాణిక్యరావు, గుండాల ఎబినైజర్, తదితరులు ఉన్నారు.

చాగంటివారిపాలెంలో ఫ్యామిలీఫిజీషియన్

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటి వారిపాలెం గ్రామంలో ఫ్యామిలీఫిజీషియన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ భరద్వాజ, ఎస్.సూర్యప్రకాశరావులు పాల్గొని 124 మందికి వైద్య సేవలందించారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో అవసరమైన విద్యార్థులకు వైద్య సేవలందించారు. మధ్యాహ్నం నుంచి ఇంటికే పరిమితమైన రోగులను పరీక్షించి మందులను అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.వి.నాగమల్లేశ్వరరావు, ఎమ్ఎల్‌హెచ్‌పీ పి.ప్రవల్య, హెల్త్ అసిస్టెంట్ జి.వెంకటేశ్వరరావు, ఏఎన్ఎమ్ ఎస్.కె.నూర్జహాన్, కె.వెంకటరత్నం, డీఈఓ రవితేజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు



గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

సత్తెనపల్లి: మాఘ మాసం పౌర్ణమి గరుడ వాహన సేవ పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారికి ఆదివారం రాత్రి విశేష అలంకరణ చేపట్టి పూజలు చేశారు. మాఘ మాసం, శుద్ధ పౌర్ణమి ని పురస్కరించుకుని శ్రీవారు స్నపన తిరు మంజనం శోభాయమానంగా జరిగింది. శ్రీవారి ఆలయంలోని గరుడల్వార్ మండపంలో శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారికి దాదాపు రెండు గంటల పాటు జరిగిన స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, రంగురంగుల ఎండుఫలాలు, వట్టివేరు, పసుపు రోజా మాలలతో శ్రీవారిని అలంక రించారు. శ్రీమాన్ శ్రీశ్యాము ఆచార్యులు రామానుజ దాసన్, శ్రీసూక్తం, భూసూక్తం, పురుష సూక్తం, నీలా సూక్తం, నారాయణ సూక్తాలను పఠిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం రైల్వేస్టేషన్ పుర విధులలో గరుడ వాహనం పై శ్రీవారి ఊరేగింపు, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చా గంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీసుభద్రా, బలభద్రా సహిత శ్రీజగన్నాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చక్రస్నానం, ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి నిత్యౌపాసన, బలిహరణ, కొట్నాలఉత్సవం, వసంతసేవ నిర్వహించారు. సాయంత్రం నరసరావుపేట సత్యసాయిబాబా సమాజం వారిచే భజనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

సీఎంకు నాయీబ్రాహ్మణ సంఘాల కృతజ్ఞతలు

అమరావతి: రాష్ట్రంలోని దేవాలయాల్లో ప్రభుత్వం నియమించే పాలక మండలి కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు ప్రాధాన్యం ఇచ్చి.. వారికి స్థానం కల్పించడం పై మండల పరిధిలోని నాయీబ్రాహ్మణ సంఘాలు సోమవారం హర్షం వ్యక్తం చేశాయి. ఎన్నడూ లేని విధంగా నాయీ బ్రాహ్మణులను గుర్తించి దేవాలయ పాలక మండలిలో స్థానం కల్పించడంపై సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్యకు సంఘం ప్రతినిధులు రావూరి శ్రీనివాసరావు, చింతపల్లి శ్రీనివాసరావు, నాదెండ్ల శివనాగమల్లేశ్వర రావు, బంధం రావూరి వెంకటేశ్వరరావు, హనుమంతు, వరప్రసాద్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో నెల 10న అన్నపూర్ణాంబిక సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, షర్డీ సాయి బాబా నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమ వారం కొటప్పకొండ దేవస్థానం ప్రధాన అర్చకులు కొండ కావూరి అప్పయ్య గురకుల శర్మ, శ్రీపతి బాలకృష్ణ చార్యుల బృందం ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచాంగ శ్రవణం, దీక్షాధారణ, రక్షబంధనం, ప్రతిష్ఠా మూర్తులకు అభ్యంగ స్నానాలు, నీరాజనం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలను కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నుదురుపాటి హనుమంతురావు శర్మ, ప్రసాదశర్మ, పరుచూరి శ్రీనివాసచార్యులు, తోమూరు శేషాచలం పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బేస్‌బాల్ టోర్నీలో సీఆర్ జట్టుకు ప్రథమ స్థానం



జట్టుతో యాజమాన్యం చుండి వేణుగోపాల్ తదితరులు

నాదెండ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన అంతర్ కళాశాలల బేస్ బాల్ టోర్నమెంట్‌లో శ్రీ చుండి రంగనాయకులు కళాశాల జట్టు ప్రథమ స్థానం స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారుల్ని కళాశాల పాలక మండలి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, అధ్యక్షుడు విజయసారథి, ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, పీడీ నాగేంద్ర విద్యార్థుల్ని అభినందించారు.జాతీయ పోటీల్లో సత్తా చాటి కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

యూనివర్సిటీ జట్టుకు ఐదుగురి ఎంపిక

టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన కళాశాల విద్యార్థులైన బి. సతీష్, బి. సాగర్‌బాబు, ఎం. సతీష్, ఎ. కుమారబాబు, ఎం. వేణు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 14–18 వరకూ అస్సాంలో జరిగే ఆలిండియా యూనివర్సిటీల టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న వసంతకుమారి

అచ్చంపేట: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి ఎదగాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి పేర్కొన్నారు. మండలంలోని రోకటిగుంటవారి పాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆమె నోట్ పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డేగల నూకేశ్వరరావు, ఉప సర్పంచ్ ఆనం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా నరసింహారావు, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

దైవ సేవకులు.. పాస్టర్లు

క్రోసూరు: పాస్టర్లందరూ నిజమైన దైవ సేవకులని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి పేర్కొన్నారు. క్రోసూరులో జీసస్ ఫాలోవర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రీస్తు సేవకుల సదస్సులో ఆమె పాల్గొని, పాస్టర్లను సత్కరించారు. నియోవర్గంలోని 5 మండలాలకు చెందిన పాస్టర్లు హాజరయ్యారు. పాస్టర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం గౌవర వేతనం అందిస్తున్న విషయం గుర్తుచేశారు. వారికి ఏ అవసర మొచ్చినా ఎమ్మెల్యే శంకరరావు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పాస్టర్లందరూ ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత కుమారిని మహిళా భక్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రోసూరు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంపై గ్రామసభ

బెల్లంకొండ: పులించింతల పునరావాస కేంద్రం న్యూ చిట్యాల గ్రామంలో స్మశాన స్థలం సమస్యపై సోమవారం మండల రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. తమ గ్రామంలో స్మశాన స్థలం లేకపోవడంతో.. ఖననం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దారు బి.నిర్మల గ్రామసభ నిర్వహించారు. స్మశాన స్థలం ఎంపిక చేసేందుకు గ్రామస్తుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. త్వరితగతిన స్మశాన స్థలాన్ని కేటాయిస్తామని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానావతు నరసింహ నాయక్, ఎంపీటీసీ శ్రావణీ బాయి, ఆర్ఐ పవన్ కుమార్, వీఆర్వో కిస్మతున్నీసా బేగం, కార్యదర్శి గిరిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ

వినుకొండ టౌన్: పట్టణంలోని పాత మార్కెట్ బజార్, శివాలయం పక్కన ఉన్న చలివేంద్ర ఆంజనేయస్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు సోమవారం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ, మండప దేవత పూజలు, అనుష్ఠానాలు, పంచామృతవాసం కార్యక్రమాల్ని హిమాలయ గురువు చేతుల మీదుగా నిర్వహించినట్లు ఆలయ అభివృద్ధి, పునఃనిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానంలో గణపతి, సుబ్రహ్మణ్య, సతీసమేత నవగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠను వేద పండితుడు అవ్వారి ఉమాశంకర దీక్షితులు శర్మ, ఆలయ అనువంశిక అర్చకుడు, జ్యోతిష వాస్తు సిద్ధాంతి చంగవల్లి వెంకట శ్రీరామచంద్రబాబు శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పూజలు ఐదు రోజుల పాటు జరుగుతాయని, ఈ నెల 9న యంత్ర స్థాపన, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి, పునః నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. చివరి రోజు భక్తులకు అన్న సంతర్పణ జరుగుతుందని తెలిపారు.

కేంద్ర బడ్జెట్ ముఖ్యాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు

సత్తెనపల్లి: కేంద్ర బడ్జెట్‌లో ముఖ్యమైన అంశాలను ప్రజల్లోకి తీసువెళ్లవలసిన బాధ్యత బీజేపీ శ్రేణుల పై ఉందని పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు అన్నారు. 2023–2024 కేంద్ర బడ్జెట్‌పై అవగాహన సదస్సు సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయిలో సోమవారం పట్టణంలోని నాగార్జుననగర్‌లో పోరుబాట –2 ఇన్‌చార్జ్ పక్కాల సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సులో బీజేపీ గురజాల నియోజకవర్గ ఇన్‌చార్జ్, బీజేపీ మీడియా ప్రతినిధి అంబటి నవకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవిశంకర్‌లు కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన అనేక అంశాలను, కేంద్ర బడ్జెట్‌లో రక్షణ శాఖకు, నూతన విద్యా విధానానికి కేటాయించిన పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో బీజేపీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాస రావు, రూరల్ మండలం అధ్యక్షుడు గంటా విజయ భాస్కర రెడ్డి, ముప్పాళ్ల మండలం అధ్యక్షుడు రామిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు బోడాల సీతాదేవి, జిల్లా ,మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: మండలంలోని జంగాలపల్లెలో కొలువైయున్న సీతారామాంజనేయస్వామి, వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు వాసు, సురేష్ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం వైభవంగా కల్యాణంతో పాటు ఆలయం ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. గ్రామ సర్పంచ్ బత్తుల సీతారామిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాత్రికి హరేరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు సమీర ఎంపిక



శావల్యాపురం: జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఆకుమళ్ల సమీర ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం జాలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు విద్యతో పాటు జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని తెలిపారు. ప్రకాశం జిల్లా చేవూరులో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో ఆకుమళ్ల సమీర ప్రతిభ చూపి ఎంపికైనట్లు చెప్పారు. తెలంగాణా రాష్ట్రంలోని మంచిర్యాలలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో సమీర పాల్గొననున్నట్లు పీడీ రాగుల రాధా కృష్ణమూర్తి చెప్పారు. విద్యార్థిని సమీరను పేరెంట్ కమిటీ చైర్మన్ ముట్లూరి ప్రసాద్, ఉపాధ్యాయులు బి.వి. నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ , భువనేశ్వరి, నిర్మల, అబ్దుల్లా తదితరులు అభినందించారు.



క్లుప్తంగా

విశేష అలంకరణలో లక్ష్మీనర్సింహస్వామి



నకరికల్లు: స్థానిక కొండపై గల శ్రీ ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి ఏకాహం సోమవారం భక్తిశ్రద్ధలతో పూర్తిచేశారు. మాఘపౌర్ణమి పురస్కరించుకుని ప్రధాన అర్చకులు కొడవటికంటి పాండురంగా చార్యులు, మధుసూదనాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ఏకాహంలో పాల్గొన్నారు. అనంతకం కొండ వద్ద భక్తసంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

నిర్ణీత మోతాదులో ఎరువులు వాడాలి



నకరికల్లు: వరిలో సూటిఎరువులైన యూరియా, భాస్వరం, పొటాష్ ఎరువులను నిర్ణీత మోతాదులో వినియోగిస్తే అధికది గుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.కృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకు ప్రయోజనం చేకూర్చే మిత్రపురుగులు, చెడు చేసే శతృపురుగుల మధ్య తేడాలను గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు దిలీప్‌కుమార్, రవిబాబు, హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు ఏఎంసీ ఎంపిక



క్రోసూరు: క్రోసూరు వ్యవసాయశాఖ మార్కెట్ యార్డు నూతన పాలక వర్గ కమిటీని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ యార్డు చైర్మన్‌గా పెదకూరపాడు మండలం75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన ఈదా సాంబిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా గార్లపాటిదాసు నియమితులయ్యారు. సభ్యులుగా సాతులూరిరాజు, మేకల శ్రీనివాసరావు, బాణావత్ శ్రీరాములు నాయక్, షేక్ ఫాతిమూన్, తిమ్మిశెట్టి కృష్ణకుమారి, షేక్ గాలీబీ, శాఖ మూరి రాజ్యలక్ష్మి, ఏకుల చిన్న కోటమ్మ, పెరుమాళ్ల వెంకట నరసమ్మ, చిరుమామిళ్ల నరసింహరావు, బొడ్డుపల్లి రాము, కూనల పద్మావతి, ఆకుల కోటేశ్వర రావు తదితరులు ఎంపికయ్యారు. 2021, డిసెంబర్‌కు అప్పటి పాలక వర్గం కాలం ముగిసిపోగా నూతన కమిటీ ఖరారైంది.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం సమీపంలోని పెదనందిపాడు బ్రాంచి కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. కాలవలోని అచ్చమ్మ డ్రాపు వద్ద మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శరీరంపై చిన్నపాటి దుస్తులుతో పాటుగా ఉబ్బిపోయి ఉండడంతో మృతదేహాన్ని బయటకు తీయడం జాప్యం నెలకొంది. నీటిలో పడి దాదాపు వారం రోజులు పైనే ఉంటుందని, వయసు సుమారు 40–45 సంవత్సరాలు ఉంటుందని, మంగళవారం బయటకు తీసి పంచనామా నిర్వహిస్తామని ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు.

కాపు యువసేన జిల్లా ఉపాధ్యక్షుడిగా రవికిరణ్



నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా కాపు యువ సేన ఉపాధ్యక్షుడిగా కంచుపర్తి రవికిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాపు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. జిల్లాలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవికిరణ్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.